
## సర్కారు తీరుపై రైతుల ఆగ్రహం

గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా మాఫీ అయిన రైతుల సంఖ్య, మాఫీ అయిన వివరాలను వ్యవసాయ శాఖ ప్రకటించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు రూ.2 లక్షలలోపు పంట రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు తర్వాత నిబంధనల పేరుతో మాట తప్పడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాఫీ ప్రక్రియ మొదటి దశను జూలైలోనే మొదలు పెట్టినట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. అదే నెలాఖరులో రెండో దశ, ఆగస్టులో మూడో దశ రుణ మాఫీ చేస్తున్నట్లు చెప్పింది. పంట రుణాలు ఉన్న వారిలో సగం మందికి కూడా మాఫీ కాలేదు. రేషన్‌కార్డు, కుటుంబం, భార్యభర్త కలిపి రూ.2లక్షల పంట రుణాలు.. ఇలా అనేక నిబంధనలు పెట్టి రుణమాఫీ లబ్ధిదారుల సంఖ్యను రాష్ట్ర ప్రభుత్వ సగానికి తగ్గించింది. దీనిపై రైతులలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. రైతుల ఉద్యమాలతో రాష్ట్ర ప్రభు త్వం సర్వే పేరుతో సాగదీసింది. కుటుంబం నిబంధన కోసం రైతులు ఫొటోలతో సహా వివరాలివ్వాలని సూచించింది. సర్వే పేరుతో రెండు నెలల పాటు సాగదీసింది. నాలుగో దశ మాఫీ ప్రక్రియను నవంబర్ 30న మొదలుపెట్టినట్లు ప్రకటించింది. మాఫీ అయిన రైతుల జాబితాను వెల్లడించడం లేదు. బ్యాంకుల్లోనూ వివరాలు లేకపోవడంతో ఎవరెవరికి మాఫీ అయ్యిందో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

**రైతులకు రుణమాఫీ దిగులు పట్టుకున్నది. పలు కారణాలతో పథకం వర్తించని వారికి నాలుగో దశలో తప్పక మాఫీ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించి రెండు వారాలు గడిచినా బ్యాంకుల్లో డబ్బులు జమకాకపోవడంతో అన్నదాతల్లో నైరాశ్యం అలుముకుంది. ఓ వైపు మాఫీ అయినట్లు సర్కారు గొప్పలు చెప్పడం.. మరోవైపు క్షేత్రస్థాయిలో అమలు కాకపోవడం, లోను గురించి అడిగితే బ్యాంకర్ల నుంచి సరైన సమాధానం రాకపోవడం వారిని అయోమయానికి గురిచేస్తోంది. మొదటి నుంచీ ఇదే గందరగోళం నెలకొనడం, ప్రభుత్వం నుంచి స్పష్టత ఇవ్వకపోవడంతో విసిగిపోయిన రైతులు కొన్నిచోట్ల రోడ్డెక్కి ధర్నాలు కూడా చేస్తూ రేవంత్ సర్కారు తీరుపై కన్నెర్ర చేస్తున్నారు.**

- వరంగల్, డిసెంబర్ 12
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- స్పష్టత లేక అందరిలో ఒకటే దిగులు
- నాలుగో దశపై తొలగని సందేహాలు
- మాఫీ అయినట్లు ఉత్తుత్తి జాబితాలు
- రెండు వారాలైనా పడని డబ్బులు
- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతులు
- సమాచారం లేదంటున్న బ్యాంకర్లు




# లోన్ ఏమైందో మాఫీ ఎప్పుడైతదో..!

అన్నదాతలను కాంగ్రెస్ సర్కారు మోసం చేస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రుణాల మాఫీ పథకం అమలు అంతంత మాత్రంగానే ఉన్నది. నాలుగో దశ రుణమాఫీ ప్రక్రియలోనూ పాత సందేహాలే వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం రుణమాఫీ అయిన రైతుల వివరాలను ఇప్పటికీ అధికారికంగా వెల్లడించడం లేదు. వివిధ కారణాలతో రుణమాఫీ వర్తించని వారికి నాలుగో దశలో పూర్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నవంబర్ 30న ప్రకటించారు. ఈమేరకు వ్యవసాయ శాఖ అనధికారింగా జిల్లాల వారీగా రైతుల పేర్లను వెల్లడించింది. రుణమాఫీ నాలుగో దశ మొదలైనట్లు సీఎం ప్రకటించి రెండు వారాలు గడుస్తున్నా ఇప్పటికీ ఒక్కరికీ మాఫీ కాలేదు. ఏ ఒక్క రైతు అకౌంట్లోనూ మాఫీ డబ్బులు జమ కాలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదు. మాఫీ అయిన రైతుల వివరాలను జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించడం లేదు. రుణమాఫీ నాలుగో దశ ప్రక్రియపై రైతుల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గత మూడు దశల తరహాలోనే నాలుగో దశ ఉన్నదని వాపోతున్నారు. నాలుగో దశ రుణమాఫీ ప్రక్రియ మొదలైనట్లు ప్రభుత్వం చెప్పిన మరుసటి రోజు నుంచే రైతులు బ్యాంకులకు వెళ్తున్నా అధికారులెవరూ స్పష్టత ఇవ్వడం లేదు. పైగా మాఫీ అయితే మీ మొబైల్ నెంబరుకు మెసేజ్ వస్తుందని, ఆ తర్వాతే తమకు తెలుస్తుందని బ్యాంకర్లు చెబుతున్నారు. నాలుగో దశ రుణమాఫీపై ప్రకటన వచ్చి రెండు వారాలైనా ఎలాంటి సమాచారం లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం అనేక నిబంధనలు పెట్టి తమను ఇబ్బంది పెడుతున్నదని, మాఫీ చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## నిజమే.. అర్హత ఉన్నా 971 మందికి మాఫీ కాలేదు

- అలంకానిపేట ఐవోబీ పరిధిలో రుణమాఫీపై జేడీఏ నిర్ధారణ
- రైతుల ధర్నా, గ్రీవెన్స్ సెల్ ఫిర్యాదుపై విచారణ
- సాంకేతిక కారణాలతో కాలేదని గుర్తింపు

నెక్కొండ, డిసెంబర్ 12: నెక్కొండ మండలం అలంకానిపేటలోని ఐవోబీ పరిధిలోని రైతులు తాము అర్హులైనప్పటికీ రుణమాఫీ వర్తించలేదని జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద ధర్నా చేయడం, గ్రీవెన్స్‌సెల్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. జిల్లా వ్యవసాయాధికారి అనురాధ గురువారం అలంకానిపేట గ్రామంలోని ఐవోబీని సందర్శించి విచారణ చేపట్టారు. అర్హులమైనప్పటికీ తమకు పంట రుణాలు మాఫీ కాలేదంటూ గత ఆగస్టు నెలలో ఓసారి, డిసెంబర్ 9న మరోసారి కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. అర్హులైన రైతులకు రుణమాఫీ కాలేదని అధికార యంత్రాంగం గుర్తించి నివేదికలు పంపినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అలంకానిపేట ఐవోబీ పరిధిలో 1477 మంది రైతులకు రూ.10.90 కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 506 మంది రైతులకు రూ.3.69 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. వివిధ సాంకేతిక కారణాలతో 971 మంది రైతులకు ఇంకా రుణాలు మాఫీ కాలేదని జేడీఏ కే అనురాధ గుర్తించారు. ఈ సందర్భంగా రైతులతో జేడీఏ మాట్లాడారు. అలంకానిపేట ఐవోబీ పరిధిలోని పెద్దకొర్పోలు, అలంకానిపేట, బొల్లికొండ గ్రామాలకు చెందిన అర్హులైన రైతులకు రుణాలు అందించాల్సి ఉందని జేడీఏ తెలిపారు. అర్హులైన రైతుల వివరాలను ప్రభుత్వానికి నివేదించి రుణ మాఫీ కావడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమె వెంట ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.


అలంకానిపేట ఐవోబీ వద్ద రైతులతో మాట్లాడుతున్న జేడీఏ అనురాధ

# హరీశ్ కుటుంబానికి మేమున్నాం..

- 2020 బ్యాచ్ ఎస్సైల భరోసా
- తల్లిదండ్రుల పేర రూ.16 లక్షల సాయం

ఏటూరునాగారం, డిసెంబర్ 12 : ఇటీవల వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్య చేసుకోగా ఆయన కుటుంబానికి మేమున్నామంటూ 2020 బ్యాచ్ ఎస్సైలు భరోసా ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వర పల్లెలో గురువారం దశదిన కర్మకు హాజరై నివాళులర్పించారు. అనంతరం హరీశ్ తల్లిదండ్రులు రామన్న, మల్లికాంబలను ఓదార్చి వారి పేర రూ.16.15 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాల రూపంలో అందించారు. కార్యక్రమంలో సుమారు 50 మంది ఎస్సైల వరకు పాల్గొన్నట్లు స్థానిక ఎస్సై తాజుద్దీన్ తెలిపారు.


హరీశ్ తల్లిదండ్రులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందిస్తున్న 2020 బ్యాచ్ ఎస్సైలు

- మంగపేట నుంచి పంబాపురం వైపు సంచారం
- పాదముద్రలతో నిర్ధారించిన అటవీ అధికారులు
- ప్రజలు, కాపరులు అడవిలోకి వెళ్లొద్దంటూ హెచ్చరిక


తాడ్వాయి: అధికారులు గుర్తించిన పులి పాదముద్రలు


మంగపేట: తిమ్మాపురం సమీప చౌడు ఒర్రెలో పులి అడుగులు కొలతలను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్

# తాడ్వాయి అడవుల్లోకి పెద్దపులి

తాడ్వాయి/మంగపేట, డిసెంబర్ 12 : తాడ్వాయి మండలంలోని పంబాపురం అడవుల్లో గురువారం పులి సంచరించింది. గ్రామ సమీప అడవిలో పులి పాదముద్రలు గుర్తించిన గ్రామస్తులు అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. దీంతో వైల్డ్ లైఫ్ ఎఫ్ఆర్వో సత్తయ్య తన సిబ్బంది కలిసి పంబాపురం సమీప ప్రాంతంలోని వాగులో పాదముద్రలను గుర్తించి పులి సంచరించినట్లు నిర్ధారించారు. బుధవారం రాత్రి మంగపేట అడవుల నుంచి తాడ్వాయి అడవుల్లోకి వచ్చినట్లు తెలిపారు. సమీప గ్రామ ప్రజలు, పశువుల కాపర్లు అడవిలోకి వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. కాగా మంగపేట మండలంలోని చుంచుపల్లి శివారు గోదావరి తీరం, తిమ్మాపురం సమీప చౌడు ఒర్రె ప్రదేశంలో గుర్తించిన పులి పాదముద్రలను గురువారం డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ పరిశీలించారు. కొలతల ఆధారంగా వచ్చింది పులేనని నిర్ధారణకు వచ్చారు.

**గుమ్మడిదొడ్డిలో తోడేలును పోలిన జంతువు ఆనవాళ్లు..**

వాజేడు : వాజేడు మండలం గుమ్మడిదొడ్డి శివారు పొలాల్లో గుర్తుతెలియని అడవి జంతువు పాదముద్రలను అటవీ అధికారులు పరిశీలించారు. గ్రామస్తులు చిరుత పులి పాదముద్రగా భావించిన నేపథ్యంలో ఆ ప్రదేశాన్ని గురువారం దూలపురం అటవీశాఖ ఇన్‌చార్జి రేంజ్ అధికారి బాలకృష్ణ ఆధ్వర్యంలో సందర్శించారు. పాదముద్రల కొలతలు తీసి వాటి ఆధారంగా తోడేలు లేదా నక్కజాతికి చెందిన జంతువుగా భావిస్తున్నట్లు తెలిపారు. నిర్ధారణ కోసం పాదముద్రల ఆనవాళ్లను హైదరాబాద్‌లోని జూకు పంపించినట్లు డీఆర్వో పేర్కొన్నారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని సూచించారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్లు శివాజీరెడ్డి, చిన్నక్క, ఎఫ్‌బీవోలు వాసుబాబు, శృతిలయ ఉన్నారు.


వాజేడు: అడవి జంతువు పాదముద్రలు

## ఏడుగురు సూపర్‌వైజర్లకు మెమోలు

వరంగల్ చౌరస్తా, డిసెంబర్ 12 : కాకతీయ మెడికల్ కళాశాల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో జరుగుతున్న వసూళ్ల దందాను నియంత్రించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం 'నమస్తే తెలంగాణ'లో 'కేఎంసీ ఆస్పత్రికి అవినీతి జబ్బు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి విధులు కేటాయించేందుకు వసూళ్లకు పాల్పడుతున్న విషయమై విచారణ చేపట్టిన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ ఏడుగురు సూపర్‌వైజర్లకు మెమోలు జారీ చేశారు. ఉచిత వైద్యసేవల కోసం వచ్చే రోగుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

నమస్తే ఎఫెక్ట్

## కొత్త ట్రాన్స్‌ఫార్మర్ పెట్టారు..

కొడకండ్ల, డిసెంబర్ 12 : జనగామ జిల్లా కొడకండ్ల మండలం నర్సింగాపురంలో విద్యుత్ సిబ్బంది కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నాలుగు నెలలైనా పట్టించుకోకపోవడంపై గురువారం 'నమస్తే తెలంగాణ' మెయిన్ పేజీలో 'మేం పంటలు వేయాలా? వద్దా?' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో కొత్తది అమర్చడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ యాసంగి సాగుకు సన్నద్ధమయ్యారు.


నర్సింగాపురం పంట పొలాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చిన అధికారులు

## ఓపెన్ అడ్మిషన్ల గడువు 16 వరకు పొడిగింపు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 12: తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను అడ్మిషన్ల గడువు 16 వరకు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి డి.వాసంతి, ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అనగోని సదానందం తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులు సమీపంలోని ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీల్లో సంప్రదించాలన్నారు. అభ్యాసకులు అవకాశాన్ని వినియోగించుకొని వారి మండలాల్లోని కేంద్రాల్లో సంప్రదించి ధ్రువపత్రాలు సమర్పించాలన్నారు. అడ్మిషన్ ఫారం పొందాలన్నారు. వారి అడ్మిషన్లు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే నమోదు చేయాల్సి ఉంటుందని, విద్యార్థులే స్వయంగా అడ్మిషన్ ఫీజును www.telanganaopenschool.org వెబ్‌సైట్ ద్వారా చెల్లించి రసీదు పొందాలన్నారు. అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్ ఫారం ప్రింటౌట్, దరఖాస్తులను 17 వరకు సమర్పించాలన్నారు. వివరాలకు ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ సదానందం 9346020003, 9396337572 నంబర్లలో సంప్రదించాలన్నారు.


హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని శ్రీశైలం మల్లన్న రైస్‌మిల్

## అధికారుల తప్పిదం.. రైతులకు శాపం

- రైస్ మిల్ కెపాసిటీకి మించి ధాన్యం దిగుమతి
- ఫలితంగా ఆన్‌లైన్‌లో నమోదు కాని ట్రక్ షీట్లు
- నెల రోజులుగా 500 మందికి అందని వడ్ల డబ్బులు
- ఇతర మిల్లుల్లో నమోదు చేసేందుకు అధికారుల నిర్ణయం
- ధాన్యం లేకుండా ట్రక్ షీట్లు అంగీకరించమన్న మిల్లర్లు

కమలాపూర్, డిసెంబర్ 12 : సివిల్ సప్లయ్ అధికారుల తప్పిదం.. రైతులకు శాపంగా మారింది. అధికారుల నిర్లక్ష్యం.. రైస్‌మిల్లర్ నిర్వాకంతో హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సుమారు 500 మంది రైతులకు ధాన్యం డబ్బుల చెల్లింపులు నిలిచిపోయాయి. నెల రోజులైనా డబ్బులు ఖాతాలో జమకాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పీఏసీఎస్‌కు 17, ఐకేపీకి 5 కొనుగోలు కేంద్రాలు కేటాయించగా, వాటి నుంచి ధాన్యం శ్రీశైలం మల్లన్న రైస్‌మిల్లుకు తరలించారు. అయితే రైస్ మిల్లు కెపాసిటీ ఆధారంగా రిలీజింగ్ ఆర్డర్ (ఆర్వో)లు కేటాయించాలి. కానీ సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యంతో రైస్‌మిల్లు వ్యాపారి ఆర్వో లేకున్నా కెపాసిటీకి మించి ధాన్యం దిగుమతి చేసుకున్నాడు. దీంతో ట్రక్ షీట్లు ఆన్‌లైన్‌లో నమోదు కాక ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరగడంలేదు. ఈ నేపథ్యంలో సదరు రైస్ మిల్లును ఇటీవల కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి రైస్‌మిల్లర్, సివిల్ సప్లయ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో రైతులకు ఎలాగైనా చెల్లింపులు చేయాలని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, వరంగల్‌లోని రైస్ మిల్లర్లకు ధాన్యం కేటాయించాలని నిర్ణయించారు. అధికారుల ఆదేశాల మేరకు ట్రక్ షీట్ల్ వారి ఫర్మ్ పేర ఆన్‌లైన్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నమోదు చేశారు. ధాన్యం లేకుండా తామెందుకు ట్రక్ షీట్లు అంగీకరిస్తామంటూ రైస్ మిల్లర్లు మెలిక పెట్టారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఇంత జరుగుతున్నా సదరు రైస్ మిల్లు యజమాని, సివిల్ సప్లయ్ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. రైస్ మిల్లు నుంచి ఇతర మిల్లులకు ధాన్యం తరలించాలంటే ఎంత ఖర్చు వస్తుంది? దీని భారం ఎవరు భరించాలి? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం అన్నదాతలు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

# కరెంటు కోతలు.. ఎండిపోతున్న పంటలు

- బిల్లులు అందరూ కట్టలేదని సరఫరా నిలిపివేసిన అధికారులు
- 400 ఎకరాల్లో మక్కజొన్న, మిర్చిపై ప్రభావం
- ఆగమవుతున్న అలంకానిపేట రైతులు

**అందరు చెల్లిస్తేనే కరెంట్ ఇస్తరట..**

నేను ఆరు ఎకరాల్లో మక్కజొన్న పంట సాగు చేశా. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకే వ్యవసాయానికి కరెంట్ ఇస్తున్నారు. దీంతో మక్కజొన్న పంట వల్లిపోతున్నది. నాలుగు గంటలే పంటకు తడి అందుతున్నది. రెండు ఎకరాల పంట మాత్రమే పచ్చగా ఉన్నది. మిగిలిన నాలుగెకరాల్లో పంట ఎండిపోతున్నది. లైన్‌మెన్‌ను అడిగితే అందరితో బిల్లులు చెల్లించాలని చెబుతున్నాడు. బిల్లులు చెల్లిస్తేనే కరెంట్ ఇస్తామంటున్నాడు. గ్రామానికి చెందిన రైతులు గాజుల గోపాల్, కోరుకొండ శ్రీనివాస్, మాదాసు సోమయ్య, గాజుల అనంతరాములు తదితర రైతులందరిది ఇదే పరిస్థితి. తక్షణం విద్యుత్ కోతలను ఎత్తివేసి మక్కజొన్న పంటను కాపాడాలి.

– చీకటి శ్రీనివాస్, రైతు, అలంకానిపేట

నెక్కొండ, డిసెంబర్ 12 : బిల్లులు చెల్లించడం లేదని అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో నెక్కొండ మండలం అలంకానిపేట శివారు ప్రాంత రైతులు ఆగమవుతున్నారు. కరెంటు లేక సాగునీరందక సుమారు 400 ఎకరాల్లో మక్కజొన్న, మిర్చి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. అలంకానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అలంకానిపేట, రెడ్యానాయక్ తండా శివారు ప్రాంతాల్లో ఐదు రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలను అమలు చేస్తున్నారు. వ్యవసాయరంగానికి నెలకు రూ.50 చొప్పున ఏటా రూ.600 రైతుల నుంచి సర్‌చార్జ్ పేరిట విద్యుత్‌శాఖ వసూలు చేస్తున్న ది. ఇవి రైతులు చెల్లించడంలేదంటూ అధికారులు కోతలు విధిస్తున్నారు. కేవలం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6 వరకే విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు సాగుచేస్తున్న మక్కజొన్న, మిర్చి పంటలు వళ్లిపోతున్నాయి. ఈ విషయాన్ని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. తాము బిల్లు చెల్లించామని, మాకెందుకు విద్యుత్ కోతలంటూ కొందరు రైతులు ప్రశ్నిస్తే అందరూ బిల్లులు చెల్లించేలా చూడాలంటూ సమాధానం చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని అందరు రైతులు బిల్లులు చెల్లించే వరకు ఇదే పరిస్థితి ఉంటుందంటూ తెగేసి చెబుతున్నారు.

**కోత పెడితేనే రైతులు చెల్లిస్తారు : లైన్ ఇన్‌స్పెక్టర్**

ఈ విషయమై లైన్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ను వివరణ అడుగగా కోతలు విధిస్తేనే రైతులు బిల్లులు చెల్లిస్తారని జవాబిచ్చారు. 'గత మూడు రోజులుగా బిల్లుల కోసం ఇలాగే కరంటు కట్ చేస్తున్నాం. మక్కజొన్న పంట ఎండిపోతున్నదని రైతులు చెబుతున్నారు కానీ ఇదే పరిస్థితి అన్ని సబ్‌స్టేషన్లలోనూ ఉంది.


అలంకానిపేటలో సాగునీరందక వళ్లిపోతున్న మక్కజొన్న పంట

## సీఎం కప్ క్రీడల్లో విద్యార్థినికి అస్వస్థత

ఎంజీఎంలో చికిత్స పొందుతున్న బాలిక


ఏటూరునాగారం, డిసెంబర్ 12 : ములుగు జిల్లా ఏటూరునాగారంలో సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొన్న బాలిక అస్వస్థతకు గురైంది. వెంటనే మండల కేంద్రంలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స అందించి వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రామన్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి గగ్గూరి గోపిక గ్రామస్థాయిలో నిర్వహించిన క్రీడల్లో పాల్గొని మండల స్థాయికి ఎంపికైంది. మండల స్థాయి పోటీలు 10వ తేదీ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నారు. కాగా, బుధవారం కబడ్డీ ఆడిన గోపిక తర్వాత పరుగుపందెంలో పాల్గొని అలసి కుర్చీలో కూర్చుని స్పృహ కోల్పోయింది. కళ్లు మూత పడి నోటి వెంట మాట రాలేదు. వెంటనే గుర్తించిన పీఈటీలు, సిబ్బంది మండల కేంద్రంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. రెండు గంటల పాటు చికిత్స అందించిన అనంతరం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. కాగా, గోపిక రాత్రి స్పృహలోకి వచ్చిందని తండ్రి విక్రమ్ గురువారం తెలిపారు. స్కానింగ్, ఇతర పరీక్షలు చేశారని, వైద్యులు గుండెకు నీరు వచ్చినట్లు గుర్తించారని ఆయన పేర్కొన్నారు. అయితే బాలిక స్పృహ కోల్పోయినపుడు వైద్య సిబ్బంది ఇక్కడ అందుబాటులో లేకపోవడంతో పీఈటీ కుమారస్వామి సీపీఆర్ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా గోగుపల్లి గ్రామానికి చెందిన సోయం అనిత కళ్లు తిరిగి పడిపోయి వాంతులు చేసుకొని అనంతరం కోలుకుంది.


చికిత్స పొందుతున్న విద్యార్థిని గోపిక

## రేవంత్‌రెడ్డి మాటలకు మోసపోయిన

- హామీలన్నీ అమలుకాక.. సొంతగూటికి చేరా
- ఎర్రబెల్లి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఉప సర్పంచ్ దేవయ్య

దేవరుప్పుల, డిసెంబర్ 12: 'ఎన్నికల వేళ రేవంత్‌రెడ్డి మాటలు నిజమేనని నమ్మి మొదటినుంచి ఉన్న బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరాను. తీరా అవన్నీ బూటకం అని తేలడంతో మళ్లీ సొంతగూటికి వచ్చా'నని అప్పిరెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ బాషిపల్లి దేవయ్య తెలిపారు. దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లికి గురువారం మాజీ మంత్రి ఎర్రబెల్లి రాగా ఆయన సమక్షంలో దేవయ్య బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్టు ప్రకటించగా దయాకర్‌రావు ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా దేవయ్య మాట్లాడుతూ.. రుణమాఫీ కాలే, రైతుబంధు రాలే, ఫించనూ రాలే, ఆఖరుకు ఇందిరమ్మ ఇల్లూ రాలేదని, దీంతో సీఎం చెప్పినవన్నీ ఉత్తమాటలేనని తేలిపోయిందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల నాయకుడు పల్లా సుందరరాంరెడ్డి, గ్రామ శాఖ ఇన్‌చార్జి ఖాసీం, వంగ అర్జున్, గ్రామ శాఖ అధ్యక్షుడు బాసిపల్లి యాకయ్య, నాగంపల్లి నర్సింగం, లోనె మహేందర్, కాంటూరి సత్యనారాయణ, గడ్డం గణపతి, గంగారపు వెంకన్న, పిట్టల సోమయ్య పాల్గొన్నారు.


మాజీ ఉపసర్పంచ్‌కు గులాబీ కండువా కప్పుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు